క్లుప్తంగా

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి

వేలేరు : దివ్యాంగ విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని ఎంఈఓ చంద్రమౌళి అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో దివ్యాంగ విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే ప్రత్యేక అవసరాలైన ఉపకరణాల పంపిణీ, రవాణా ఖర్చులు, ఇతర అలవెన్స్‌ను సక్రమంగా వినియోగించుకోవాలని అన్నారు. దివ్యాంగ పిల్లలపై వివక్ష చూపొద్దని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజన్న, ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్, ఉపాధ్యాయులు సీతా, ఓదెలు, ఐఈఆర్పీ స్నేహలత, ఫిజియోథెరపిస్ట్ మమత పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న పోలీసులు



కమలాపూర్ : ఓ అభాగ్యుడిని ఆదరించి స్థానిక పోలీసులు మానవత్వం చాటుకున్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో ఒరిస్సాకు చెందిన దుర్గ అనే అభాగ్యుడు శుక్రవారం చిరిగిన దుస్తులు, పెరిగిన జుట్టుతో దీనంగా సంచరిస్తుండటాన్ని గమనించిన బ్లూకోల్ట్ పోలీసులు కృష్ణమోహన్, సంపత్ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణకు సమాచారం అందించారు. దీంతో ఇన్‌స్పెక్టర్ సూచనలతో దుర్గకు స్థానిక సెలూన్‌లో క్షవరం, షేవింగ్ చేయించారు. అనంతరం శుభ్రంగా స్నానం చేయించి పాదరక్షలు, నూతన దుస్తులు, ఆహారం అందజేసి మానవత్వం చాటుకున్నారు. దీంతో గ్రామస్తులు పోలీసులను అభినందించారు.

టిప్పర్ ఢీ కొని మహిళకు గాయాలు

ఆత్మకూరు : అరటిపండ్లు విక్రయిస్తున్న మహిళను టిప్పర్ ఢీ కొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని గూడెప్పాడ్ జంక్షన్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బయ్య శాంతమ్మ గూడెప్పాడ్ జంక్షన్‌లో అరటి పండ్లు విక్రయిస్తుంది. ఈ క్రమంలో హనుమకొండ నుంచి పరకాలకు వెళ్తున్న టిప్పర్ ఆమెను ఢీ కొట్టింది. దీంతో శాంతమ్మ తీవ్రంగా గాయపడింది. గమనించిన స్థానికులు 108కి సమాచారం అందించి వరంగల్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు.

పీహెచ్‌సీ వైద్యాధికారిగా మేఘన

వేలేరు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా మేఘన శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండల పరిధిలోని పేద ప్రజలకు పీహెచ్‌సీ ద్వారా మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తానని అన్నారు. అలాగే పీహెచ్‌సీలో అవసరమైన మందులు, సౌకర్యాలు అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపడుతానని అన్నారు. కాగా ఇంకాలం ఇంచార్జ్‌గా విధులు నిర్వర్తించిన డాక్టర్ రాజశేఖర్ తిరిగి వంగర పీహెచ్‌సీకి వెళ్లనున్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కమలాపూర్ : అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మానేరు వాగు నుంచి హనుమకొండకు ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను కమలాపూర్‌లో పట్టుకున్నామని, వారి వద్ద ఇసుక తరలింపునకు సంబంధించి ఎలాంటి అనుమతులు లేవన్నారు. దీంతో మూడు ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

సభను జయప్రదం చేయాలి



పరకాల : హమాలీ కార్మిక హక్కుల సాధన కోసం ఈనెల 8న వరంగల్‌లో జరిగే మార్కెట్ హమాలీ ఏఐటీయూసీ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం మార్కెట్ ఆవరణలో వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. సభ నేపథ్యంలో మార్కెట్‌కు సెలవు ఇవ్వాలని అధికారులకు వినతిపత్రం అందించారు.

అందుబాటులో ఉంటాం..

ఆత్మకూరు : యువజన కాంగ్రెస్ కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని, కష్ట సుఖాల్లో పాల్పంచుకుంటామని నూతనంగా ఎన్నికైన యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్, ఆత్మకూరు మండల అధ్యక్షుడు తనుగుల సందీప్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం వారు మాట్లాడారు. తమ ఎన్నికకు సహకరించిన కాంగ్రెస్ నాయకులకు, యూత్ కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి అందరితో కలిసి పనిచేస్తామని అన్నారు.

భక్తుల కొంగు బంగారం కుంకుమయ్య

- సుబ్రహ్మణ్య షష్టిజాతర ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి
- నేడు అర్చకుడి ఇంటి నుంచి బయలుదేరనున్న బోనం
- హాజరుకానున్న ప్రముఖులు
- వేలాదిగా తరలిరానున్న భక్తులు



కుంకుమేశ్వర స్వామి దేవస్థానం

పరకాల : ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రత్యేకతను సంతరించుకున్న సుబ్రహ్మణ్య షష్టి జాతర ఉత్సవాలు శనివారం అట్టహాసంగా ప్రారంభం కానున్నాయి. స్వయంవ్యక్త సాకరమూర్తిగా భక్తుల కొంగుబంగారమై విరాజిల్లుతున్న పురాణ ప్రాశస్త్యము కలిగి అత్యంత శైవక్షేత్రముగా పేరుగాంచిన పట్టణంలోని శ్రీకుంకుమేశ్వర స్వామి దేవస్థానంలో అర్చకుడి గృహం నుంచి బయలుదేరనున్న బోనం ఊరేగింపుతో అత్యంత వైభవంగా చేరుకోనుంది.


సుబ్రహ్మణ్య షష్టి జాతర ప్రత్యేకత..

కాలాంతరములో కాలగర్భములో కలిసిపోయి కాకతీయ సామంతరాజులైన రేచర్ల రుద్రుడు 1213 సంవత్సర కాలంలో ఓ రైతు పంటభూమిగా ఉన్నటువంటి ప్రస్తుత దేవాలయ స్థలం చదును చేస్తుండగా నాగలికి రాయి అడ్డుతగినట్లు అనిపించింది. ఆ రైతు ఆయా ప్రదేశాన్ని తవ్విచూడగా శివలింగం కూడుకొని కనిపించింది. దీంతో ఆ రైతు వెంటనే ఆ స్థలాన్ని శుభ్రపరచి తాత్కలిక పందిరి ఏర్పాటు చేసి సాయంత్రానికి తన ఇళ్లు చేరుకున్నాడు. రాత్రి పార్వతీదేవితో ప్రతిష్ఠాపన చేసి స్వయంవ్యక్త శివలింగం శ్రీకుంకుమేశ్వరస్వామిగా తెలిపినట్లు పురాణాలు తెలుపుతున్నాయి. ఉదయం నిద్రలేచిన రైతు కాలకృత్యాలు, స్నానమాచరించి స్వామివారిపైన పసుపు అలంకరించాడు. మరుసటి రోజు చూడగా స్వామి వారు చెప్పినట్లుగాను పసుపు కుంకుమగా మారింది. అప్పటి నుంచి శ్రీకుంకుమేశ్వర స్వామి శైవాగమ సాంప్రదాయకంగా పూజలు ప్రారంభించారు. అలా శివలింగం పసుపు కుంకుమగా మారిన రోజు నుంచి సుబ్రహ్మణ్య షష్టి జాతరగా పిలువడం ప్రారంభమయ్యింది. కొన్ని వందల సంవత్సరాల నుంచి ప్రతి ఏడాది సుబ్రహ్మణ్య షష్టి రోజున బోనం, స్వామి వారికి విశేష పూజలు నిర్వహించి పాంచాహ్నిక దీక్షతో స్వామివారి జాతర కల్యాణోత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. కోరిన కోర్కెలు తీరుస్తుండటంతో ప్రతి ఏడాది షష్టి జాతరకు వందలాది మంది భక్తులు చేరుకొని స్వామివారిని దర్శించుకుంటారు. అందుకే దేశంలో నాలుగు శైవ క్షేత్రాల్లో పరకాలలోని శ్రీకుంకుమేశ్వర స్వామి దేవస్థానం ఒకటిగా వర్ధిల్లుతోంది.

షష్టిజాతర ఉత్సవాలు

షష్టి జాతర ఉత్సవాలు ఆలయానికి బోనం చేరడంతో ప్రారంభమవుతుంది. ఆరు రోజుల పాటు వేద మంత్రోచ్ఛరణల నడుమ వైభవంగా కొనసాగుతుండడంతో ఉమ్మడి జిల్లా నుంచి వందలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుంటారు. షష్టి జాతర ఉత్సవాల ఏర్పాట్లను ఆలయ కమిటీ, ఆలయ అర్చకులు పర్యావేక్షిస్తారు. శుక్రవారం ఆనతి కట్టుట, అష్టదిగ్బంధన పూజ కార్యక్రమాల అనంతరం శనివారం వంశానుగత అర్చకులు కోమాళ్లపల్లి సంపత్‌కుమార్‌శర్మ నివాసం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం స్వామివారి షష్టి బోనం గ్రామ ప్రదక్షిణముగా బయలుదేరుతుంది. అలాగే 08 (ఆదివారం) అగ్నిప్రతిష్ఠ, స్వామివారికి ఎదురుకోళ్లు, స్వామివారి కల్యాణ మహోత్సవం, 09న సోమవారం నిత్యాహ్నికం పూజలు, చందనోత్సవం వంటి విశేష పూజలు, 10న (మంగళవారం) నాగబలి, తాంబూలోత్సవం, 11 (బుధవారం) అన్నపూజోత్సవం, స్వామి వారి మృగయాత్ర నిర్వహిస్తారు. 12న (గురువారం) వృషభ వాహన సేవ, త్రిశూల స్నానం, ధ్వజావరోహణం, అష్టోత్తరం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు కోమాళ్లపల్లి నాగభూషణంశర్మ తెలిపారు.

కష్టాలు తీర్చే స్వామి కుంకుమయ్య



వంశానుగత అర్చకులుగా పట్టణంలో కుంకుమేశ్వర దేవస్థానంలో స్వామి వారికి పూజలు, సేవలు అందించడం అదృష్టంగా చెప్పుకోవచ్చు. షష్టి పూజలో పాల్గొన్న భక్తుల కష్టాలు, కోర్కెలు తీర్చడంలో కుంకుమేశ్వర స్వామి ఆలయం రాష్ట్రంలోనే పేరుగాంచింది. బోనం ఊరేగింపు, ఆలయంలో స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ చర్యలు చేపట్టింది. నేటి నుంచి ప్రారంభమయ్యే సుబ్రహ్మణ్య షష్టిజాతర ఉత్సవాలకు పట్టణంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలి.

– నాగభూషణంశర్మ, ఆలయ ప్రధాన అర్చకుడు



ఆలయంలో కుంకుమేశ్వర స్వామి



గర్భగుడిలో పసుపు, కుంకుమతో స్వామివారు



అర్చకుడి ఇంటి నుంచి బయలుదేరిన బోనం (ఫైల్)



షష్టిజాతర ఉత్సవాల్లో పల్లకిసేవ (ఫైల్)

అమ్మవార్లను దర్శించుకున్న మంత్రి కొండా సురేఖ



ఆత్మకూరు : మండలంలోని అగ్రంపహాడ్ సమ్మక్క– సారలమ్మను అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. స్థానికులతో మాట్లాడి యోగక్షేమాలు తెలుసుకున్నారు. మంత్రి సురేఖ వెంట స్థానిక కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ఉద్యమకారుల ఫోరం జిల్లా కోకన్వీనర్‌గా గణేశ్



శాయంపేట : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా కోకన్వీనర్‌గా పాడిశెట్టి గణేశ్‌ను నియమించినట్లు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు పోతు జ్యోతిరెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. తన నియామకానికి సహకరించిన ఫోరం రాష్ట్ర అధ్యక్షుడికి, మహిళా అధ్యక్షురాలుకి, ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఐనవోలులో..



ఐనవోలు : మండలంలోని గర్మిళ్లపల్లి గ్రామానికి చెందిన గబ్బెట కృష్ణను తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కళాకారుల విభాగం స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కన్వీనర్‌గా నియమిస్తూ రాష్ట్ర కన్వీనర్ పోశెట్టి శుక్రవారం వెల్లడించారు.

అక్రమ అరెస్ట్‌లను వెంటనే ఆపాలి

- బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు శివ



మాట్లాడుతున్న నాయకులు

శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వం బీఆర్‌ఎస్ నాయకుల అక్రమ అరెస్ట్‌లను వెంటనే ఆపాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు కొమ్ముల శివ, తెలంగాణ ఉద్యమకారుల సంఘం మండల అధ్యక్షుడు పాడిశెట్టి గణేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని బీఆర్‌ఎస్ నాయకులను అక్రమ అరెస్ట్ చేసి పోలీస్‌కు తరలించడంపై వారు మండిపడ్డారు. ఎలాంటి కారణాలు లేకుండా అక్రమ అరెస్ట్‌లు చేయడం హేయమైన చర్య అన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, బీఆర్‌ఎస్ నాయకులను అక్రమంగా అరెస్ట్‌లు చేస్తే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదన్నారు. ప్రజాపాలనపై దృష్టి పెట్టి ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాలని హితవు పలికారు. బీఆర్‌ఎస్ పార్టీ మైలారం, శాయంపేట టౌన్ అధ్యక్షుడు గాజె రాజేందర్, గ్రామశాఖ అధ్యక్షుడు చల్లా శ్రీనివాస్‌రెడ్డి, పత్తిపాక గ్రామశాఖ అధ్యక్షుడు పసుల ప్రవీణ్, నాయకులు రాజ్‌మహ్మద్, వెంకట్ పాల్గొన్నారు.

దామెర : మండలంలోని బీఆర్‌ఎస్ నాయకులను శుక్రవారం ముందస్తు అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అరెస్టు నేపథ్యంలో బీఆర్‌ఎస్ నాయకులు హైదరాబాద్‌కు వెళ్తున్నారనే సమాచారంతో మండలానికి చెందిన కృష్ణమూర్తి, ప్రసాద్, కిశోర్, కమలాకర్, అశోక్, రాజు, రాజేందర్, సునీల్, శ్రీనివాస్ తదితరులను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు.

ఐనవోలు : హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అరెస్ట్‌కు నిరసనగా మండలంలోని పున్నేలు క్రాస్ వద్ద ఆందోళనకు సిద్ధమవుతున్న బీఆర్‌ఎస్ నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేసినట్లు ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపారు. అరెస్టైన వారిలో నాయకులు వంశీ, కుమార్, అశోక్, రాజు, మహేష్ ఉన్నారు.

సంక్షేమ పథకాలపై టీఎస్‌ఎస్ ప్రచారం



దామెర : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై తెలంగాణ సాంస్కృతిక సారధి (టీఎస్‌ఎస్) కళాకారులు శుక్రవారం ప్రచారం నిర్వహించారు. పసరగొండ, ఊరుగొండ, ఒగ్లాపూర్ గ్రామాల్లో కళాజాత నిర్వహించారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.2లక్షల రుణమాఫీ, 500కు గ్యాస్ సిలిండర్, 50 వేల ఉద్యోగాల భర్తీ, మహిళలకు వడ్డీలేని రుణాలు, త్వరలో ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలపై పాటల ద్వారా ప్రజలకు వివరించారు. టీం లీడర్ కొండ సారంగ పాణి, సభ్యులు డాక్టర్ వెన్నెల శ్రీనాథ్, మారెపల్లి జాన్, బూడిద సురేందర్, బొంకూరి ప్రభాకర్, అడ్డూరి శ్రీనివాస్, గడ్డం కళావతి, రహీమ, పుట్ట జానకి, పాల్గొన్నారు.

బాలల అక్రమ రవాణాను నిర్మూలించాలి

- ఏహెచ్‌టీయూ సీఐ వెంకన్న



అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకన్న

వేలేరు : బాలల అక్రమ రవాణాను నిర్మూలించాలని ఏహెచ్‌టీయూ(యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్) వరంగల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకన్న అన్నారు. మండల కేంద్రంలోని సెయింట్ ఫ్రాన్సిస్ పాఠశాలలో సేవా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. అపరిచిత వ్యక్తులు, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే ముందుగా తల్లిదండ్రులకు తెలుపాలని అన్నారు. చదువుకునే పాఠశాలలో తోటి విద్యార్థులు అసభ్యకరంగా ప్రవర్తిస్తే ఉపాధ్యాయులకు ఫిర్యాదు చేయాలన్నారు. విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, ఇంటర్‌నెట్‌ను అవసరం మేరకే వినియోగించాలని అన్నారు. అనంతరం సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ అనితారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే చదువుపై దృష్టి సారించి జీవిత లక్ష్యాన్ని ఎంచుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఫాదర్ కిరణ్‌కుమార్, ఎఫ్‌ఎంఎం పీఆర్వో శ్రీకాంత్, సేవ వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి ఉషా బాస్కర్, సీఆర్‌ఎఫ్ కో ఆర్డినేటర్ సురేందర్, సిస్టర్లు శిరిష, చామంతి, నిఖిత, నిర్మల పాల్గొన్నారు.

పిల్లలపై తల్లిదండ్రులు బాధ్యత వహించాలి



మాట్లాడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

శాయంపేట : విద్యార్థుల బాధ్యత కేవలం అధ్యాపకులదే కాదని, తల్లిదండ్రులు కూడా బాధ్యత తీసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కందగట్ల కోటేష్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కోటేష్ మాట్లాడుతూ.. విద్యార్థులు సెల్‌ఫోన్‌కు బానిసవకుండా విద్యార్థుల తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలని అన్నారు. తల్లిదండ్రులు, అధ్యాపకులు సమన్వయంతో ఉన్నప్పుడే విద్యార్థుల్లో మంచి నడవడిక అలవర్చుతుందన్నారు. అనంతరం అధ్యాపకుల పాఠాల బోధన బాగుతుందని తల్లిదండ్రులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు అంకం లింగమూర్తి, నామని శివశంకర్, చింత రజిత, యాకూబ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం కప్‌ను విజయవంతం చేయాలి

- ఎంపీడీఓ విజయ్‌కుమార్



క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఎల్కతుర్తి : ప్రభుత్వం నిర్వహించనున్న సీఎం కప్ క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ విజయ్‌కుమార్ కోరారు. ఈ మేరకు శుక్రవారం క్రీడా మైదానాన్ని పరిశీలించారు. మండల కేంద్రంలోని కార్మెల్ పాఠశాల ప్రాంగణంలో ఈ పోటీలు మూడు దశలుగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నేడు, రేపు మొదటి దశలో గ్రామస్థాయిలో వాలీబాల్, అథ్లెటిక్స్, ఫూట్‌బాల్, కబడ్డీ, యోగా పోటీలు, ఎంపికలు ఉండనున్నట్లు తెలిపారు. అలాగే మండల స్థాయిలో 10,11వ తేదీల్లో నిర్వహిస్తామని చెప్పారు. ఆ తర్వాత ఈనెల 16వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జిల్లాస్థాయి పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. మొత్తం 36 క్రీడాంశాల్లో జిల్లాస్థాయిలో పోటీలు, ఎంపికలు చేపట్టి రాష్ట్ర స్థాయి జట్లను ఎంపిక చేస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామ, మండలస్థాయి కమిటీలు నియమించినట్లు తెలిపారు. ఎంఈఓ చదువుల సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆల్‌ఇన్‌వన్ పంపిణీ

ధర్మసాగర్ : మండలంలోని మల్లక్‌పల్లి గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎంపీడీఓ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆల్‌ఇన్‌వన్ పంపిణీ చేశారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీహెచ్‌ఎస్, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జానపద కళాకారులకు సన్మానం

ఐనవోలు : మండల కేంద్రంలో యాదవుల కథలు, చరిత్ర తెలిపే జానపద కళాకారులను జీఎంపీఎస్ మండల కార్యదర్శి నల్లబెట్ట చిన్న రాజు సన్మానించారు. 15 రోజులుగా యాదవుల కథలు చెప్పి, శుక్రవారం కులం చిత్రపటాలను ప్రదర్శించారు.

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలి

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే వివిధ మండల కేంద్రాల్లో పలు సంఘాల నాయకులు అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్



కమలాపూర్ : అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ప్రణవ్



ఐనవోలులో..



శాయంపేట : అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



వేలేరులో..



ధర్మసాగర్‌లో..



దామెరలో..



ఎల్కతుర్తిలో..



పరకాలలో..



ఐనవోలులో..



నడికూడలో..



శాయంపేట : అంబేడ్కర్ భవనం నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న బహుజన సంక్షేమ సంఘం నాయకులు



ఆత్మకూరు : నీరుకుళ్లలో..